చుక్కనీటిబొట్టునూ వదలొద్దు

- కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా సాధించి తీరాలి
- ట్రిబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపించాలి
- న్యాయనిపుణులు, ఇరిగేషన్ ఇంజనీర్లతో సమీక్షలో రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నికర, మిగులు, వరద జలాలు ఏదైనా సరే కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాలో చుక్కబొట్టును కూడా వదలకుండా సాధించి తీరాలనీ, తెలంగాణకు 904 టిఎంసిల నీటి వాటాను సాధించుకునేందుకు కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపించాలని న్యాయనిపుణులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సూచించారు. అందుకు అవసరమైన ఆధారాలన్నీ వెంటనే సిద్ధం చేసి న్యాయ నిపుణులకు అందించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. విచారణకు నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వయంగా హాజరవుతారని తెలిపారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఢిల్లీలో కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ విచారణలో తెలంగాణ తుది వాదనలు వినిపించాల్సి ఉన్న నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సిఎం సమీక్ష నిర్వహించారు. అందులో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సీఎస్. వైద్యనాథన్, కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్ కె.వోహ్రా, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, ఇఎన్‌సి అంజద్ హుస్సేన్, సిఎంఒ కార్యదర్శి మాణిక్‌రాజ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

904 టిఎంసిల కోసం పట్టుబట్టండి

ఇంతకాలం కృష్ణా నదీ జలాల్లో జరిగిన అన్యాయానికి అడ్డుకట్ట వేసి, రావాల్సిన ప్రతి నీటి బొట్టును దక్కించుకునేందుకు అవసరమైన సాక్ష్యాధారాలన్నీ ట్రిబ్యునల్‌కు సమర్పించాలని సిఎం సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటివరకూ కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులు, తలపెట్టిన ప్రాజెక్టులు, అసంపూర్తి ప్రాజెక్టులు, నిర్లక్ష్యంగా వదిలేసిన ప్రాజెక్టుల వివరాలన్నింటినీ ట్రిబ్యునల్ ముందు ఉంచాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన జిఒలు, మెమోలు, డాక్యుమెంట్లన్నింటినీ సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం కృష్ణా జలాల్లో రావాల్సిన నీటి వాటాలను సాధించకపోగా ఆంధ్రప్రదేశ్‌కు 512 టిఎంసిలు కట్టబెట్టి 299 టిఎంసిల వాటాకు ఒప్పుకొని తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని ప్రస్తావించారు. గత సీఎం 299 టిఎంసిల వాటాకు ఒప్పుకున్న విషయాన్ని ఏపీ ఇప్పుడు ట్రిబ్యునల్ ముందుకు తెచ్చిందనే విషయాన్ని న్యాయ నిపుణులు సిఎంకు వివరించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం కృష్ణాపై తలపెట్టిన పాలమూరు ఎత్తిపోతల నుంచి డిండి వరకు ప్రాజెక్టులన్నింటినీ పెండింగ్‌లో పెట్టి నీటి వాటాల విషయంలో తీరని ద్రోహం చేసిందని సిఎం విమర్శించారు. దిగువ రాష్ట్రాల హక్కులతో పాటు నదీ వాటాల పంపిణీ న్యాయ సూత్రాల ప్రకారం కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రానికి కృష్ణాలో 904 టిఎంసిల నీటి వాటా రావాల్సి ఉందనీ, అందుకు అనుగుణంగా వాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

మళ్లింపులపై వాదించండి

శ్రీశైలం రిజర్వాయర్ నిండకముందే పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా రోజుకు పది టిఎంసిల నీటిని ఆంధ్రప్రదేశ్ మళ్లిస్తున్నదనీ, ఇతర బేసిన్లకు తరలించుకుపోతున్నదని ఎత్తిచూపారు. ఎక్కడపడితే అక్కడ కాల్వల సామర్థ్యం పెంచుకోవటంతో పాటు పట్టిసీమ, పులిచింతల, చింతలపాడు వరకు అక్రమంగా నీటిని తరలిస్తున్న అంశాలన్నింటినీ ట్రిబ్యునల్‌కు నివేదించాలని ఆదేశించారు. కృష్ణా నీటిని ఆంధ్రప్రదేశ్ అక్రమంగా మళ్లించటంతో శ్రీశైలం, నాగార్జునసాగర్‌తో పాటు పులిచింతల వద్ద ఉన్న జల విద్యుత్తు ప్రాజెక్టులు మూత పడే ప్రమాదం ముంచుకు వచ్చిందన్నారు. తక్కువ ఖర్చుతో ఉత్పత్తయ్యే జల విద్యుత్తు ఉత్పత్తికి విఘాతం కలుగుతున్నదని తెలిపారు. వాటిని కూడా ట్రిబ్యునల్ ముందు ప్రస్తావించాలన్నారు.

హక్కులున్నాయ్..అర్హతలున్నాయ్

కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రం కావటంతో తెలంగాణకు రావాల్సిన హక్కులు, నీటి వాటాలను సాధించుకునేందుకు అన్ని అర్హతలున్నాయని సీఎం అన్నారు. సాగు, తాగునీటి అవసరాలతో పాటు మెట్ట, కరువు ప్రాంతాలైన ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు కృష్ణా జలాలు తప్ప గత్యంతరం లేదనే విషయాన్ని ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఇప్పటి వరకు తెలంగాణలో తలపెట్టిన ప్రాజెక్టులు పూర్తి చేయక పోవడం వల్లనే కృష్ణా జలాలను తెలంగాణ వినియోగించుకోలేక పోయిందని గుర్తు చేయాలన్నారు. వాదనలను వినిపించేందుకు ఇదే సరైన అవకాశమన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంతో పాటు, కృష్ణా నదీ జలాల్లో రావాల్సిన వాటాల భవిష్యత్తును దిశానిర్దేశం చేసే వాదనలు కావటంతో ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లో జారవిడుచుకోవద్దని న్యాయ నిపుణులకు సిఎం సూచించారు.

మహిళా సమాన హక్కులకు పోరాడిన లక్ష్మీదేవమ్మ

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి
- ఎన్ఎస్ లక్ష్మీదేవమ్మ ప్రథమ వర్ధంతి సభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళల సమాన హక్కుల కోసం లక్ష్మీదేవమ్మ అలుపెరగక పోరాడారాడని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. శనివారం ఎన్ఎస్ లక్ష్మీదేవమ్మ మొదటి వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో సభ నిర్వహించారు. ముందుగా లక్ష్మీ దేవమ్మ చిత్రపటానికి ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి కేఎన్ ఆశాలత, సీనియర్ నాయకులు ఎం.లక్ష్మమ్మ పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు ఆర్. అరుణ జ్యోతి అధ్యక్షతన జరిగిన సభలో మల్లు లక్ష్మి మాట్లాడారు. లక్ష్మీదేవమ్మ తన జీవితకాలమంతా మహిళా హక్కుల కోసమే పని చేశారని, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శిగా, మహిళా సంఘం నిర్మాతగా ముఖ్య భూమిక పోషించారని తెలిపారు. వ్యవసాయ కూలీల వేతనాల పెంపు కోసం, ఇండ్ల స్థలాల కోసం చేసిన పోరాటాల్లోనూ ఆమె కృషి చేశారని అన్నారు. ముఖ్యంగా 498 చట్టం సాధనలో ముఖ్య భూమిక పోషించారని, సమాన హక్కులు కావాలని జరిగిన పోరాటంలో మహిళలందరినీ ఐక్యం చేసి ఉద్యమాలు చేశారని తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కుటుంబ న్యాయ సలహా కేంద్రానికి మొట్టమొదటి కన్వీనర్‌గా ఉంటూ భార్యాభర్తల సమస్యలను పరిష్కరించడంలో, కుటుంబాన్ని సమన్వయం చేసి కలిపి ఉంచడంలో విశేష కృషి చేశారని తెలిపారు. తన ఉద్యమ అనుభవాలను, మహిళలు రోజువారీగా ఎదుర్కొనే అనేక ఆటంకాలను ఏ రకంగా అధిగమించవచ్చో తెలియజేస్తూ అనేక రచనలు చేసి మహిళలను చైతన్యపరిచారన్నారు. తన ఆశయాలను ముందుకు తీసుకుపోవడమే తనకు ఇచ్చే నివాళి అని అన్నారు.

తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షిస్తాం

- కెడబ్ల్యుడిటిలో బలమైన వాదనలు వినిపిస్తాం
- 291 టిఎంసిలను పునర్విభజన చేయాల్సిందే : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షిస్తామనీ, ఈ నెల 23న జరిగే కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్-2 ఎదుట బలమైన వాదనలు వినిపిస్తామని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణకు చెందాల్సిన నీటివాటాలో చుక్క నీరు కూడా వదులుకునే ప్రసక్తేలేదని తేల్చిచెప్పారు. ఈ నెల 23 నుంచి 25 వరకు ఢిల్లీలో జరిగే కేడబ్ల్యూడీటీ విచారణలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించాల్సిన అంశంపై శనివారం హైదరాబాద్‌లోని జలసౌధలో మంత్రి సమీక్ష నిర్వహించారు. అందులో నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇఎన్‌సి అంజద్ హుస్సేన్, సుప్రీంకోర్టు న్యాయవాది సీఎస్. వైద్యనాథ్, న్యాయనిపుణులు, నీటిపారుదల రంగం నిపుణులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. 811 టిఎంసిల కృష్ణా జలాశయాల్లో తెలంగాణ ప్రాంతానికి 71 శాతం కేటాయింపులుండాని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. తెలంగాణలో నిర్మిస్తున్న ప్రాజెక్టులకు 65 శాతం కేటాయింపులు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. అధికారులు అందిస్తున్న నివేదికల ప్రకారం జూన్, జులై నెలల్లో అవసరమైన నీటి కోసం 80 టిఎంసిల నీటిని అందుబాటులో ఉంచేలా వాదనలు విపించడంతో పాటు ఆపరేషన్ ప్రొటోకాల్ నిబంధనలననుసరించి మిగిలిన నీటిని వినియోగించుకునే స్వేచ్ఛ తెలంగాణాకు ఉండేలా ట్రిబ్యునల్ ముందట ఉంచుతామని వివరించారు. ఐఎస్‌ఆర్‌డబ్ల్యాడి చట్టంలోని సెక్షన్ 4(1)(ఎ)తో పాటు పునర్వ్యవస్థీకరణ చట్టంలోని పదకొండో షెడ్యూల్ పదో పేరాగ్రాఫ్ వంటి న్యాయపర అంశాలను కుడా ఈ విచారణలో వాదించబోతున్నట్టు తెలిపారు.

వాగులో పడి నలుగురు మృతి

- మృతుల్లో తల్లీకొడుకు
- కుమురంభీం జిల్లాలో విషాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒకే గ్రామానికి చెందిన నలుగురు వాగులో పడి మృతి చెందిన విషాదకర ఘటన ఆసిఫాబాద్ కుమురంభీం జిల్లా వాంకిడి మండలం డాబా గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తల్లీకొడుకు మోర్లె నిర్మల(25), గణేష్(10), అలాగే ఆడె శశికళ(12), వడాయి మహేశ్వరి(12) శనివారం మధ్యాహ్నం యూరియా బస్తాలు శుభ్రం చేయడానికి గ్రామ సమీప వాగులోకి వెళ్లారు. అక్కడ బస్తాలు శుభ్రపరుస్తుండగా ఓ బస్తా కొట్టుకుపోవడంతో గణేష్ ముందుకు వెళ్తూ ప్రమాదవశాత్తు నీటమునిగాడు. గమనించిన తల్లి నిర్మల కొడుకునే రక్షించే ప్రయత్నం చేయగా ఆమెతో పాటు అక్కడే ఉన్న ఆడె శశికళ, వడాయి మహేశ్వరి నీటమునిగారు. ఆ సమయంలో అక్కడే బట్టలు ఉతుకుతున్న అదే గ్రామానికి చెందిన మోర్లె లలిత వారిని చూసి విషయాన్ని గ్రామస్తులకు తెలిపింది. దీంతో గ్రామస్తులు వాగు వద్దకు రాగా.. అప్పటికే వారు మృతిచెందారు. ఒకే ఘటనలో గ్రామానికి చెందిన నలుగురు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. మహేందర్-నిర్మల దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. కుమారుడు గణేష్ మండల కేంద్రంలోని గ్రీన్ హుడ్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. ఆడె శశికళ, వాడై మహేశ్వరి గ్లోబల్ మీడియాలో ఐదో తరగతి చదువుతున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. విషయం తెలుసుకున్న సిఐ సత్యనారాయణ, ఎస్ఐ మహేందర్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్ములా-ఈ వన్ కారు రేస్ కేసులో విజిలెన్స్‌కు చేరిన ఎసిబి రిపోర్టు

ప్రజాశక - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన ఫార్ములా-ఈ వన్ కారు రేస్ కేసులో నిందితులకు సంబంధించిన నివేదికను రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) నుంచి విజిలెన్స్ కమిషన్‌కు నివేదిక చేరింది. ఈ నివేదికను క్షుణ్ణంగా పరిశీలిస్తున్న విజిలెన్సు కమిషన్ తదుపరి న్యాయపరమైన చర్యలకు సంబంధించి ప్రభుత్వ అనుమతిని కోరనుంది. సాధారణంగా ఐఎఎస్‌లు, తత్సమాన హోదా కలిగిన అధికారులతోపాటు ఏదేనీ కేసులో ప్రజా ప్రతినిధుల హస్తముందని తేలితే వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవటానికి విజిలెన్స్ కమిషన్‌కు ఎసిబి నివేదికను పంపుతారు. దానిపై సమగ్రంగా పరిశీలన జరిపి, ప్రభుత్వానికి తదుపరి చర్యల కోసం విజిలెన్స్ తన నివేదికను అందజేస్తుంది. ఆపై ప్రభుత్వం ఇచ్చే ఆదేశాల మేరకు ఎసిబి కోర్టులో ప్రాసిక్యూషన్ ప్రక్రియను చేపడుతుంది. ఫార్ములా-ఈ కారు రేస్ కేసులో దాదాపు రూ.54 కోట్ల మేర నిధుల మార్పిడి అక్రమంగా జరిగిందనీ, దానికి ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన అనుమతులు కానీ, రిజర్వ్ బ్యాంకు నుంచి ముందస్తు అనుమతులు గానీ తీసుకోకుండా అప్పటి మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రి కెటిఆర్, హెచ్ఎండిఎ అప్పటి మేనేజింగ్ డైరెక్టర్ అర్వింద్ కుమార్, చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి ఆ నిధులను విదేశీ కంపెనీకి తరలించటంపై నిబంధనలను అతిక్రమించారంటూ ఎసిబి తన నివేదికలో పేర్కొంది. ముఖ్యంగా విదేశీ మారకద్రవ్యాన్ని ఇందుకు వినియోగించారని కూడా తెలిపింది. దీనిపై సమగ్ర విచారణ జరిపిన ఎసిబి...కెటిఆర్‌ను ప్రధాన నిందితుడిగా, అర్వింద్ కుమార్‌ను రెండో ముద్దాయిగా, బిఎల్ఎన్ రెడ్డిని మూడో ముద్దాయిగా చేరుస్తూ ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయడమేగాక ఈ ముగ్గురినీ విచారించింది. దీనిపై అన్ని ఆధారాలనూ సేకరించి, నిందితులను ప్రాసిక్యూషన్ చేయటానికి అనుమతిని కోరుతూ ఎసిబి, విజిలెన్స్ కమిషన్‌కు నివేదికను పంపించింది. దీనిపై విజిలెన్స్ కమిషన్ ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలన జరుపుతున్నారు. తదుపరి చర్యల కోసం ఒకట్రెండు రోజుల్లో సీఎం కార్యాలయానికి కమిషన్ తన రిపోర్టును పంపించనుందని తెలిసింది. అదే సమయంలో కెటిఆర్‌పై గవర్నర్‌కు ఒక నివేదికను ప్రభుత్వం పంపించనుంది. ప్రాసిక్యూట్ చేయటానికి కెటిఆర్ అనుమతిని తీసుకోనున్నారని సమాచారం.

నకిలీ ష్యూరిటీల కేసులో ఎనిమిదిమంది అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పంచాయతీ కార్యదర్శి సంతకాలు ఫోర్జరీ చేసి నేరస్తులకు జామీను ఇప్పించడంతో పాటు కోర్టులో జప్తు చేయబడిన వస్తువులను విడిపించేందుకు అవసరమైన ష్యూరిటీ పత్రాలతో మోసగించిన కేసులో ఆదిలాబాద్ జిల్లా, తలమడుగు మండలం కొత్తూరు పంచాయతీ కారోబారితో పాటు ఎనిమిదిని అరెస్ట్ చేసినట్టు ఎస్పి అఖిల్ మహాజన్ తెలిపారు. ప్రధాన సూత్రదారి కారోబారి తలమడుగు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన కాటిపెల్లి అభిలాష్‌రెడ్డితో పాటు ఆయనకు సహకరించిన ఖుర్షీద్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఇర్ఫాన్, గంటి సత్నా, మద్దెల అశోక్, రామిరెడ్డి, కొకటాయ్ అశోక్, షాహిద్, ఎండీ అమీర్‌ను అరెస్టు చేసినట్టు వెల్లడించారు. ఈమేరకు శనివారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిఎస్‌పి జీవన్‌రెడ్డి, సిఐ నాగరాజుతో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. నకిలీ ష్యూరిటీలను ఉపయోగించి, లబ్ది పొందిన, బ్రోకరిజం చేసిన 17 మందిపై టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు. తలమడుగు మండలం కొత్తూరు గ్రామపంచాయతీ కార్యదర్శి గిరవేరి రాహుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఈ దర్యాప్తు చేపట్టారు. నిందితులు అభిలాష్‌రెడ్డి సయ్యద్ ఇర్ఫాన్‌తో కలిసి కార్యదర్శి సంతకాలను ఫోర్జరీ చేసి పలువురికి కోర్టు బెయిల్, ఆస్తుల విడుదల కోసం ష్యూరిటీ పత్రాలను సృష్టించడంతో పాటు నకిలీ గృహ విలువ పత్రాలు, పన్ను రసీదులు సృష్టించి బాధితుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసేవారని తెలిపారు. కార్యదర్శి అందించిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు దర్యాప్తు జరిపి నిందితులను అదుపులోకి తీసుకున్నారన్నారు. తెలియని వారికి, పెద్ద పెద్ద నేరాలు చేసే వారికి, బ్రోకర్ల ద్వారా వచ్చే వారికి ప్రభుత్వ అధికారులలు ష్యూరిటీలు ఇచ్చి మోసపోవద్దని తెలిపారు.

అదాని, అంబానీలకే 'వికసిత్ భారత్'

- ఎఐబిఇఎ జాతీయ ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటాచలం
- ప్రభుత్వ రంగాన్ని కాపాడితేనే దేశ మనుగడ : కూనంనేని సాంబశివరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ విధానాల్లో మార్పు రావాల్సిన అవసరముందని, అంతే తప్ప వికసిత భారత్, అమృత్ కాల్ అంటూ సామాన్యులను ఇంకా మోసం చేయలేరని ఎఐబిఇఎ జాతీయ ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటాచలం అన్నారు. వికసిత్ భారత్, అమృత్ కాల్ అంటే కేవలం అదాని, అంబానీలకే చెల్లుతుందని పేదలకు కాదని తెలిపారు. ఎఐసిబిఇఫ్ ఎపి, టిఎస్ 37వ మహాసభ, సిబిఐఒయు ఎపి, టిఎస్ 13వ త్రైవార్షిక సభలు సంయుక్తంగా హైదరాబాద్ కాచిగూడలోని మ్యాడం అంజయ్య హాల్‌లో ఎ.సుందర్ రావు ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటాచలం మాట్లాడుతూ.. వ్యవసాయం, ఉత్పత్తిరంగాలు, చిన్నతరహా పారిశ్రామిక రంగం కుడా అతలాకుతలం అవుతుందని, అయినప్పటికీ ప్రభుత్వం మోసపూరిత ప్రకటనలు చేస్తూ సామాన్యులను మభ్య పెడుతున్నదని విమర్శించారు. ప్రయివేటు బ్యాంకులు ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నా పాలకులు వారిని ప్రోత్సహిస్తూ, ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ప్రభుత్వరంగాన్ని కాపాడితేనే దేశం మనుగడ సాధ్యమవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బ్యాంకు ఉద్యోగుల హక్కుల పరిరక్షణలో ఎర్రజెండా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బ్యాంకింగ్ రంగంలో చోటుచేసుకున్న స్కామ్‌లను వెలుగులోకి తీసుకురావడంలో మాజీ నేతల పాత్రను గుర్తు చేస్తూ, చట్టసభల్లో ఉద్యోగుల గొంతు వినిపించగల ప్రతినిధులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు.

వ్రాంగ్ స్టోర్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఇబ్రహం అలీ

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ వ్రాంగ్ తన నూతన బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ నటుడు ఇబ్రహీం అలీని నియమించుకుంది. ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన టిఎంఆర్‌డబ్ల్యుతో నడుస్తోన్న వ్రాంగ్ దేశ వ్యాప్తంగా 50కి పైగా ప్రత్యేక స్టోర్లు, 205కి పైగా రిటైల్ స్టోర్లను కలిగి ఉంది. కాగా.. శనివారం హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్‌లోని స్టోర్‌కు ఇబ్రహీం అలీఖాన్ వచ్చి కొత్త కలెక్షన్లను ఆవిష్కరించారు. అనంతరం వేదికపై సందడి చేసి అభిమానులను అలరించారు. ఈ కార్యక్రమంలో వ్రాంగ్ సహ వ్యవస్థాపకులు అంజనా, విక్రమ్ రెడ్డి హాజరయ్యారు.

నగరంలో పిఎంజె జ్యువెల్స్ ఎగ్జిబిషన్



హైదరాబాద్ : ప్రముఖ అభరణాల రిటైల్ చైయిన్ పిఎంజె జ్యువెల్స్ ఆధ్వర్యంలో శనివార హైదరాబాద్‌లో అతిపెద్ద బ్రైడల్, హాఫ్ సారీ జ్యువెల్లరీ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. తాజ్‌కృష్ణలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన సెప్టెంబర్ 15 వరకు కొనసాగుతుందని వెల్లడించింది. దీనికి యాంకర్ ఉదయ భాను, పిఎంజె జ్యువెల్స్ ఛైర్మన్ కుశాల్ హాజ్రై సందడి చేశారు. ఈ మూడు రోజుల ప్రదర్శనలో సమకాలీన వజ్రాలు, వివిధ రంగుల రత్నాలు (జెమ్‌స్టోన్స్), సాంప్రదాయ పోల్కీలు, టెంపుల్ జ్యువెల్లరీ కళాఖండాలు, ఆకర్షణీయ జాదువా, కుందన్ సెట్‌లతో పాటు 20,000కు పైగా కొత్త డిజైన్‌లు ప్రదర్శించబడుతున్నాయని దినేష్ కంకారియా వెల్లడించారు.

బిఎన్ఐ అతిపెద్ద ఎంఎస్ఎంఇ ఎక్స్‌పో ప్రారంభం

- ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు
- 200 పైగా ఎంఎస్ఎంఇల ఉత్పత్తులు,సేవల ప్రదర్శన
- దేశ, విదేశాల నుంచి సందర్శకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచంలో అతిపెద్ద వ్యాపార నెట్‌వర్కింగ్, వ్యాపార రిపరల్ సంస్థ అయిన బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ (బిఎన్ఐ) ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ ఎస్-ఎస్ కన్వెన్షన్‌లో 'బీఎన్ఐ వాంటేజ్ గోనాట్ - 2025' పేరుతో ఏర్పాటు చేశారు. ఆ ఎంఎస్ఎంఇ ఎక్స్‌పోను శనివారం పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. బిఎన్ఐ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే ఈ ఈవెంట్‌లో పారిశ్రామికవేత్తలు, వ్యాపార దృక్పథం కలిగిన వ్యక్తులు హాజరవుతారు. ఈ గోనాట్-2025కు భారత్, మధ్య ప్రాచ్య దేశాలు, పొరుగు దేశాల నుంచి ఇరవై వేలకు పైగా సందర్శకులు రానున్నారు. 200 పైగా ఎంఎస్ఎంఈలు తమ విభిన్న ఉత్పత్తులు, సేవలను ప్రదర్శిస్తూ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద బీఎన్ఐ రీజియన్‌గా నిలిచిన బిఎన్ఐ హైదరాబాద్, 400 పైగా పరిశ్రమల్లో 4,000 పైగా వ్యాపార యజమానులను కలిగి ఉంది.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎంఎస్ఎంఇ భవిష్యత్తు, దేశ నిర్మాణంలో వాటి పాత్ర, ఈ రంగాన్ని బలపరచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై డైనమిక్ ఫైర్‌సైడ్‌గా ఉంటుందన్నారు. బిఎన్ఐ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనా షా మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక ఎక్స్‌పో మాత్రమే కాదని, ఇది సహకారాలకు జన్మనిచ్చే, ఆలోచనలకు రెక్కలు విప్పే ఎకోసిస్టమని అన్నారు. సరైన అవకాశాలతో, పెద్ద కలలతో గ్లోబల్ స్టేజ్‌లో నిలబడే అవకాశాన్ని అందించడం తమ లక్ష్యమన్నారు. అనంతరం లీడ్ ఆర్ బ్లీడ్ పుస్తక రచయిత, క్వాంటమ్ లీప్ లెర్నింగ్ సొల్యూషన్స్ వ్యవస్థాపకులు రాజీవ్ తల్రేజా, జూహెూ కార్పొరేషన్ ఇంజనీరింగ్, బిజినెస్ సొల్యూషన్స్ డైరెక్టర్, జూహెూ స్కూల్ ఆఫ్ లెర్నింగ్ అధ్యక్షుడు రాజేంద్రన్ దండపాని, జెట్ సెట్‌గో ఏవియేషన్ సహ వ్యవస్థాపకురాలు, సిఇఒ కనికా తెక్రివాల్ తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బేకింగ్, ఫొటోగ్రఫీ, ఫ్యాషన్ డిజైన్, ఇంటీరియర్ స్టైలింగ్, అడ్వర్టైజింగ్, ఫుడ్ ఇన్నోవేషన్ వంటి విభాగాల్లో చాప్టర్ కాంటెస్టులు, వ్యక్తిగత పోటీలు సృజనాత్మకతతో సందడిగా సాగాయి. మొదటి రోజు అజీమ్ బనాత్వాలా స్టాండ్-అప్ కామెడీ ఆకట్టుకుంది. ఉత్తమ ప్రతిభావంతులకు అవార్డ్స్ అందించారు. రీగల్ రెసిడెన్సెస్ టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమానికి కో-స్పాన్సర్లు ఒపిపిఇఐఎన్, పోకర్ణా లిమిటెడ్, లియో పాకర్స్ అండ్ మూవర్స్ ప్రయివేట్ లిమిటెడ్ గోల్డ్ స్పాన్సర్‌గా ఉన్నారు. ఈ కార్యక్రమంలో బిఎన్ఐ హైదరాబాద్ ఏరియా డైరెక్టర్ టి సతీష్‌కుమార్, శ్రీఆదిత్య కెడియా రియల్టర్స్ ఎల్ఎల్పీ విష్ణు కుమార్ కెడియా, ఒపిపిఇఐఎన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అల్లూరి శ్రీనివాస్ రాజు, క్వాంట్రా క్వార్ట్జ్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ చంద్ర జైన్, లియో పాకర్స్ అండ్ మూవర్స్ ప్రయివేట్ లిమిటెడ్ శ్రద్ధా షా పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి

- లాభాల వాటా రూ.20 వేలు చెల్లించాలి
- మాజీ శాసన సభ్యులు జూలకంటి, గుమ్మడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచాలని మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి రంగారెడ్డి, గుమ్మడి నరసయ్య డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు పెద్ద ఎత్తున తరలొచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణిలో బొగ్గు ఉత్పత్తిలో, లాభాలు సాధించడంలో కాంట్రాక్ట్ కార్మికుల పాత్ర ఉన్నదని గుర్తు చేశారు. లాభాల వాటాలో వారికి రూ.20వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచడంలో, సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. కోలిండియాలో ఇదే రకమైన పనులను నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు రోజుకు రూ.1,285 చెల్లిస్తుంటే సింగరేణిలో కేవలం రూ.541మాత్రమే చెల్లించటమేంటని ప్రశ్నించారు. కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వరంగ సంస్థలైన సింగరేణిలో సెలవులు, వైద్యం, క్యాంటీన్ తదితర చట్టబద్ధ సౌకర్యాలు కూడా అమలు చేయకపోవడం దారుణమని చెప్పారు. కార్మికుల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలైనా వారికిచ్చిన హామీని ఎందుకు విస్మరిస్తున్నారని ప్రశ్నించారు. 2024-25 లాభాల బోనస్ చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు బి. మధు, యాకుబ్ షా వలి, యాకయ్య, కరుణాకర్, బాబు, రామనాథం, రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

కాలేజీల బంద్‌కు ఎస్ఎఫ్ఐ మద్దతు

- ఫీజు బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పెండింగ్‌లో ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ప్రయివేటు ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్యా కాలేజీలు, డిగ్రీ, పీజీ కళాశాలలు చేపట్టిన నిరవధిక బంద్‌కు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ పూర్తి మద్దతును ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రజనీకాంత్, కార్యదర్శి టి నాగరాజు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందే ఫీజులను విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చిందని తెలిపారు. మరింత పారదర్శకంగా అందిస్తామని ప్రకటించిందని పేర్కొన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత అసలు ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. పైగా ఈ పథకాన్ని ఎత్తేసే కుట్రలకు తెరలేపున్నదని తెలిపారు. విద్యార్థులు తమ సర్టిఫికెట్ల కోసం కోర్టులకు వెళ్తున్న పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని పేర్కొన్నారు. యాజమాన్యాలు ఫీజులు రాలేదంటూ సర్టిఫికెట్లు ఇవ్వకుండా నిలుపుదల చేస్తున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. గత 15 నెలలుగా విద్యార్థులు నిరంతరం రోడ్లపైకి వచ్చి నిరసనలు చేస్తున్నా స్పందించడం లేదని తెలిపారు. ప్రజాప్రభుత్వం పేరుతో ప్రజలతో ఉంటామంటునే కనీసం స్పందించకపోవడం దుర్మార్గపు చర్యఅని పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారి యాజమాన్యాలు బంద్ చేస్తున్న పరిస్థితి ఏర్పడిందని వివరించారు. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ చేయాలని సూచించారు. ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు మద్దతుగా ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొంటామని తెలిపారు.

ట్రిటాన్ వాల్వ్స్ 50 ఏళ్ల ఉత్సవాలు

హైదరాబాద్ : ఆటోమొబైల్ టైర్ వాల్వ్ తయారీదారు ట్రిటాన్ వాల్వ్ లిమిటెడ్ తయారీదారు 50 ఏళ్ల విజయోత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ ప్రయాణం కేవలం కార్పొరేట్ మైలురాయి మాత్రమే కాదని తమ కలలు నిజమైన గాథ అని ఆ కంపెనీ అధిపతి అదిత్య గోకర్ణ్ పేర్కొన్నారు. 1975లో స్థాపించిన ట్రిటాన్ వాల్వ్, ప్రస్తుతం భారత మార్కెట్లో 70 శాతం వాటా కలిగి ఉందన్నారు. రూ.488.37 కోట్ల టర్నోవర్‌తో పాటు 12 దేశాలకు ఎగుమతులను కలిగి ఉన్నామన్నారు.

రైతులు నేరస్తులా?

హైదరాబాద్ బ్యూరో : కామారెడ్డి జిల్లాలో రైతులను పోలీసు స్టేషన్‌కు తరలించిన ఘటనపై బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి అన్నం పెట్టే రైతులు నేరస్తులా?అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. భూమి కోసం పోరాడిన లగచర్ల దళిత, గిరిజన, బలహీనవర్గాల రైతులపై అక్రమ కేసులు బనాయించి సంకెళ్లు వేశారని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పుడు బస్తా యూరియా కోసం పొలాలు వదిలి పోలీసు స్టేషన్లకు వెళ్లి పడిగాపులు కాసే దుస్థితిని రైతన్నకు ఈ ప్రభుత్వం తెచ్చిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతగాని పాలనతో రైతులను అరిగోస పెడుతున్నారని తెలిపారు. అన్నదాతలను నడిరోడ్డుకు ఈడ్చి వికృతానందం పొందుతున్నారని పేర్కొన్నారు. రైతులను పోలీసు స్టేషన్లలో పెట్టి ఎరువులు పంపిణీ చేసే పరిస్థితులు తెచ్చిన రేవంత్‌రెడ్డి చరిత్ర హీనుడిగా మిగిలిపోక తప్పదని హెచ్చరించారు. రైతులను నేరస్తులుగా పోలీసు స్టేషన్లలో కూర్చోబెట్టిన ఈ దుర్మార్గ వైఖరిని యావత్ తెలంగాణ సమాజం గమనిస్తున్నదనీ, తగిన సమయంలో బుద్ధి చెబుతుందని తెలిపారు.

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S No: 221/2024
రాచమల్లి శివ ఆంజనేయులు మరియు కొందరు ... వాదులు
మరియు
తాత కోటేశ్వరమ్మ మరియు కొందరు... ప్రతివాదులు
To
వాసిరెడ్డి సరితదేవి W/o శ్రీధర్
R/o పాలవంచి గ్రామం, ఖమ్మం జిల్లా,
తెలంగాణ రాష్ట్రం.
పై నంబరు దావాలో మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపను చేయుచున్నారని శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీరు తేది 17-10-2025న ఉదయం 10.30ని.ల నుండి సాయంత్రం ఐదు గంటల లోపు పైకోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో దావాని మీకు పరోక్షంగా తీర్మానించబడునని తెలుసు కొనేది.
వాయిదా తేది : 17-10-2025
// శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వులతో //
మోతుకూరి సుభాష్ బాబు
మద్దినేని గృహలక్ష్మి
అడ్వకేట్స్, అద్దంకి

సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

- ఐఐఆర్ఎం స్నాతకోత్సవంలో ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వరరావు

ఐఐఆర్ఎం స్నాతకోత్సవంలో పాల్గొన్న ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత ఆర్థికాభివృద్ధిలో బీమా రంగం ప్రముఖ పాత్ర పోషిస్తోందని, భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు భారత బీమా రంగం, సంస్థలు సన్నద్ధం కావాలని భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వరరావు అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా, దేశంలో వస్తున్న వాతావరణ, భౌగోళిక, సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా బీమా సంస్థలు విధానాలు, పద్ధతులు, సేవలను రూపొందించుకోవాలని సూచించారు. శనివారం రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్సురెన్స్, రిస్క్ మేనేజ్‌మెంట్ (ఐఐఆర్ఎం) స్నాతకోత్సవానికి ఎం రాజేశ్వర రావు హాజరై మాట్లాడారు. ఆర్థిక రంగాన్ని ముందుకు తీసుకెళ్లడానికి స్థిరమైన ఆర్థికం, ప్రభావవంతమైన రిస్క్ మేనేజ్ నాయకత్వం అవసరన్నారు. ఐక్యరాజ్య సమితి 2020-23 నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 1.1 డిగ్రీల సెల్సియస్ పెరిగిందని, ఈ వాతావరణ అసమానతలను నియంత్రించకుంటే ప్రపంచ వ్యాప్తంగా 4 శాతం జిడిపిని నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. దీని ప్రభావం అన్నిరంగాలపై పడుతుందన్నారు. ముఖ్యంగా బీమా రంగంపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం 2023-24 ఆర్థిక సంవత్సరం లెక్కల ప్రకారం దేశంలో బీమా రంగం విస్తరణ తక్కువగా ఉందని, ప్రపంచవ్యాప్తంగా బీమా ప్రీమియం సగటు ఏడు శాతం కాగా భారతదేశంలో అది 3 శాతంగా ఉందని తెలిపారు. అయితే ఆర్థిక నిపుణుల అంచనాల ప్రకారం భవిష్యత్తులో మన దేశంలో ఆర్థిక రంగం కంటే ఎక్కువగా బీమారంగం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. 2024-28 మధ్యకాలంలో దేశంలో బీమా రంగం వృద్ధి 11 శాతం ఉంటుందని భారత బీమారంగం అంచనా వేసిందని, అందులో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో బీమా ప్రీమియం రూ.11.2 లక్షల కోట్లతో ఏడు శాతానికి పెరిగిందని అంచనా వేసిందని తెలిపారు. ఈ వృద్ధి సాంకేతిక అంశాలు, వాతావరణ మార్పులు, సూక్ష్మ ఆర్థిక వ్యవహారాలు తదితర అంశాలపై ఆధారపడి ఉంటుందని, ఆర్థిక సంస్థలు ఈ మార్పులను సూక్ష్మంగా గమనిస్తూ ముందుకు వెళ్లాలన్నారు. ఐఆర్‌డిఎఐ సభ్యులు రజయ్ కుమార్ సిన్హా మాట్లాడుతూ.. బీమా, ఆర్థిక సేవల రంగంలో అభివృద్ధి చెందుతున్న అవకాశా లను అందిపుచ్చుకోవాలని, గ్రాడ్యుయేట్లు వారి వృత్తిపర మైన ప్రయాణాల్లో ఆవిష్కరణ, అనుకూలతను ఎప్పటికప్పుడు స్వీకరించాలని సూచించారు. ముందుగా ఐఐఆర్ఎం డైరెక్టర్ అరవింద్ కుమార్ స్వాగతోపన్యాసం చేస్తూ బీమా, రిస్క్ మేనేజ్ అనుబంధ ఆర్థిక సేవలలో ఆవిష్కరణ, నైతిక నాయకత్వాన్ని నడిపించే నిపుణులను పెంపొందించడంలో సంస్థ నిబద్ధతను పునరుద్ఘాటించారు. సభకు ఐఐఆర్ఎం ప్రిన్సిపాల్ డాక్టర్ వివికె మోహన్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో భారత ఇన్సురెన్స్ రెగ్యులేటరీ, డెవలప్ అథారిటీ (ఐఆర్‌డిఎఐ) సభ్యులు రజయ్ కుమార్ సిన్హా పికె అరోరా, సత్యజిత్ త్రిపాఠి, ఐఐటి సిఇఒ వెంకట్ చెంగవల్లి, ఎస్‌బిఐ లైఫ్ ఇన్సురెన్స్ చీఫ్ అభిషేక్ ముజుందార్ తదితరులు పాల్గొన్నారు.

మీ సేవా ఉద్యోగుల వేతనాలు పెంచాలి

- మంత్రి పొన్నంకు వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మీ సేవా ఉద్యోగుల వేతనాలు పెంచాలనీ, వారి సమస్యలు పరిష్కరించాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్‌తో పాటు మీ సేవా రాష్ట్ర నాయకులు కవిత, ప్రకాశ్, రాజు,బాలకృష్ణ కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. కనీస వేతనాలు పెంచాలనీ, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ మీ సేవా కేంద్రాలు అద్భుతంగా పనిచేస్తున్నాయనీ, ప్రజలకు అనేక సేవలను అందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందని సీఎం, ఐటీ శాఖ మంత్రి పలు మార్లు చెప్పారని గుర్తు చేశారు. మీ సేవా సర్వీస్సుల్లో ప్రజల సౌకర్యార్థం ప్రవేశపెడుతున్న అనేక సేవల వల్ల పని భారం పెరుగుతున్నప్పటికీ పట్టుదలగా శ్రమిస్తున్నామని తెలిపారు. రెండేండ్ల నుండి కనీస వేతనాలు పెంచలేదనీ, బ్రేక్ లేకుండా పీఎఫ్ ఖాతాలు కొనసాగించాలని కోరారు. వార్షిక బోనస్ లేదా ఇన్సెంటీవ్ కూడా చెల్లించలేదని తెలిపారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా జీతాలు పెంచాలనీ, రూ. పది లక్షలు హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను వెంటనే అమలు చేయాలనీ, వార్షిక బోనస్, ఇన్సెంటీవ్ ప్రతి ఏడాది చెల్లించాలని డిమాండ్ చేశారు.

దశల వారీగా కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధి

- దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీ వాత్సవ
- స్టేషన్ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు : ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

జిఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌ను దశల వారీగా అభివృద్ధి చేయనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీ వాత్సవ తెలిపారు. ఈ నెల 18 నుంచి కాగజ్ నగర్‌లో వందేభారత్ రైల్‌కు హల్టింగ్ ఇవ్వనున్న నేపథ్యంలో స్టేషన్‌లో సౌకర్యాలను పరిశీలించేందుకు శనివారం ఆయన కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. ప్రత్యేక రైలులో వచ్చిన ఆయన 3వ నెంబర్ ప్లాట్‌ఫాంపై దిగగా, స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌బాబు స్వాగతం పలికారు. జీఎం వెంట డిఆర్ఎం గోపాలకృష్ణన్, చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ ఎస్‌కే శర్మ, సీనియర్ డిఎం రామారావు ఉన్నారు. ఈ సందర్భంగా మూడో నెంబర్ ప్లాట్‌ఫాంపై ఉన్న అసౌకర్యాలను ఎమ్మెల్యే జీఎంకు వివరించారు. ఈ ప్లాట్‌ఫాంపై టిక్కెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, టాయిలెట్స్ సౌకర్యం కల్పించాలని, పూర్తి స్థాయి షెడ్డు ఏర్పాటు చేయాలని జీఎంను ఎమ్మెల్యే కోరారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంటుందని, దీన్ని వెడల్పు చేస్తూ నూతనంగా నిర్మించాలని సూచించారు. మూడు ప్లాట్‌ఫాంలపై మూడు లిఫ్ట్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం మొదటి నెంబర్ ప్లాట్‌ఫాంను, స్టేషన్ బయట పరిసరాలను జీఎం పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చే రోడ్ల పరిస్థితి బాగా లేదని, ఈ రోడ్ల అభివృద్ధికి మున్సిపాలిటీ ప్రతిపాదనలు తయారు చేస్తున్నందున దీనికి రైల్వే శాఖ కూడా సహకరించాలని ఎమ్మెల్యే జీఎంను కోరారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. కాగజ్‌నగర్ స్టేషన్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను ఎమ్మెల్యే వివరించారని, వాటిని దశల వారీగా అమలు చేస్తామని అన్నారు.

రూ. 20 కోట్లతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే

కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ. 20 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే హరీశ్‌బాబు తెలిపారు. ఈ నిధులతో స్టేషన్‌ను త్వరితగతిన అభివృద్ధి చేయనున్నామన్నారు.

కాగజ్‌నగర్‌లో ఇప్పటికే వందేభారత్‌తో పాటు సంఘమిత్ర, పాటలిపుత్ర, యశ్వంత్‌పూర్-గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హల్టింగ్ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ప్రాంతం నుంచి శబరిమల వెళ్లే అయ్యప్ప స్వామి భక్తుల సౌకర్యార్థం కేరళ ఎక్స్‌ప్రెస్‌కు హల్టింగ్ ఇవ్వాలని జీఎంను కోరినట్టు తెలిపారు. సికింద్రాబాద్ నుంచి హౌరా వరకు వయా కాగజ్‌నగర్, బల్లార్షాల మీదుగా కొత్త రైలు ప్రతిపాదనను కూడా జీఎం ముందు ఉంచామన్నారు. వచ్చే నెలలో సికింద్రాబాద్ నుంచి బీహార్‌లోని ముజఫర్‌పూర్ వరకు వయా గయ, ప్రయాగ్‌రాజ్ మీదుగా కొత్తగా అమృత్‌భారత్ రైలు ప్రారంభం కానుందని, దీనికి కూడా కాగజ్‌నగర్‌లో హాల్టింగ్ ఇచ్చినట్టు తెలిపారు. రైల్వేల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని అన్నారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, నాయకులు దెబ్బటి శ్రీనివాస్, పాటు రైల్ యాత్రి సేవా సమితి సభ్యులు అరుణ్‌లోయ, ప్రయాగ్ తివారి, పవన్ బల్దేవా ఉన్నారు.

మహిళ, చిన్నారుల భద్రతకు త్వరలో నూతన పాలసీ

- ప్రతి చిన్నారికీ భద్రతతో కూడిన బాల్యం అందించడమే లక్ష్యం
- 17 నుంచి అక్టోబర్ 16 వరకు పోషణ మాసం : మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో చిన్నారుల భద్రతను తమ ప్రజాప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా భావిస్తోందనీ, త్వరలో మహిళలు, చిన్నారుల భద్రత కోసం నూతన పాలసీ తీసుకురాబోతున్నట్టు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లోని హోటల్ పార్క్‌లో సిఐఐ, యంగ్ ఇండియన్స్ ఆధ్వర్యంలో మాసూమ్ సమ్మిట్ పదో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి సీతక్కతో పాటు డీజీ. శికా గోయల్, సీఐఐ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ చైర్మన్ శివప్రసాద్ రెడ్డి, మాసూమ్ యంగ్ ఇండియన్స్ చైర్‌పర్సన్ జోష్నాసింగ్ అగర్వాల్, యంగ్ ఇండియన్స్ నేషనల్ చైర్మన్ తరంగ్ ఖురానా, మాసూమ్ కోచ్ భవిన్ పాండ్యా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. "పిల్లలు అంటే మన భవిష్యత్తు. వారి రక్షణ అంటే మన భవిష్యత్తు రక్షణ. పసి హృదయాల్లో నాటుకుపోయే భావనలే వారి జీవితాన్ని నిర్దేశిస్తాయి. చిన్నారి గాయపడితే ఆ గాయం జీవితాంతం వెంటాడుతుంది. అందుకే పిల్లలు నిర్భయంగా, స్వేచ్ఛగా, ధైర్యంగా జీవించే వాతావరణాన్ని కల్పించడం సమాజం మొత్తం బాధ్యత" అని హితబోధ చేశారు. ఈ నెల 22న మేధావులు, స్వచ్ఛంద సంస్థలు, ఉన్నతాధికారులతో మహిళా సదస్సు నిర్వహిస్తామని, అందులో వచ్చే సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కొత్త పాలసీ రూపొందిస్తామని చెప్పారు. చిన్నారుల పోషకాహారంపై దృష్టి సారిస్తూ ఈ నెల 17 నుంచి అక్టోబర్ 16 వరకు పోషణ మాసం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. "పిల్లల్లో పౌష్టికాహారం పెంపొందించేందుకు పరిశోధనలు జరిపి అంగన్‌వాడీ మెనూలో మార్పులు చేశామని గుర్తుచేశారు. లైంగిక నేరాల నియంత్రణలో కేవలం శిక్షలకే పరిమితం కాకుండా శిక్షణా కార్యక్రమాలు కూడా ఉండాలని సీతక్క స్పష్టం చేశారు. పాఠశాలల్లో అమ్మాయిలకు స్వీయ రక్షణ శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. మహిళలను గౌరవించాలనే విషయాన్ని తరగతి గదిలోనే పిల్లలకు నేర్పాలని, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలపై ఇండ్లలో, పాఠశాలల్లో, గ్రామాల్లో తప్పనిసరిగా చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. తప్పు జరిగితే పిల్లలు ధైర్యంగా మాట్లాడే వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. చిన్నారుల అక్రమరవాణ, బాల కార్మిక వ్యవస్థపై ఉక్కుపాదం మోపుతున్నామని తెలిపారు. అలాగే డ్రగ్స్ నియంత్రణకు సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో పోలీస్ శాఖలో ప్రత్యేక నార్కోటిక్స్ విభాగాన్ని ఏర్పాటు చేసి, నిఘాను పెంచామని తెలిపారు.

శంషాబాద్‌లో రూ.500 కోట్ల విలువైన భూమి హైడ్రా స్వాధీనం

- ప్రహరీతో పాటు లోపల వేసిన షెడ్డుల తొలగింపు
- 12 ఎకరాల చుట్టూ ఫెన్సింగ్
- ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'పైగా భూములు' అంటూ ప్రభుత్వ భూములను కొంతమంది ప్రయివేటు వ్యక్తులు ఆక్రమించి, నిర్మాణాలు చేపడితే శనివారం హైడ్రా అధికారులు ఆ అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమి విలువ సుమారు రూ.500 కోట్లు ఉంటుందని అంచనా. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని సాతంరాయి గ్రామం సర్వే నెంబర్ 17లో 12 ఎకరాల ప్రభుత్వ భూమిని 2011లో అప్పటి ప్రభుత్వం.. ఇంటర్మీడియట్ బోర్డుకి శిక్షణా కేంద్రాల ఏర్పాటు కోసం అప్పగించింది. అయితే ఆ భూమి పైగా భూమి అని పేర్కొంటూ కొంతమంది కబ్జా చేసి, అందులో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వ భూమిని విడిపించాలని బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారులు, స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా రంగంలోకి దిగింది. స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో రికార్డులను పరిశీలించింది. అది ప్రభుత్వ భూమి అని నిర్ధారించుకొని అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఇనుప స్తంభాలు పాతి ఫెన్సింగ్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా హైడ్రా ఇన్స్‌స్పెక్టర్ సిహెచ్ తిరుమలేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా పని చేస్తోందని తెలిపారు. నగరంతో పాటు చుట్టుపక్కల ప్రభుత్వ భూములను జల్లెడ పడుతూ ఇప్పటికే వందలాది ఎకరాలను హైడ్రా స్వాధీనం చేసుకుందని చెప్పారు. సాతంరాయిలోని ఆ భూమిని ప్రభుత్వం 2011లో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బోర్డుకు కేటాయించిందన్నారు. అయితే ఈ భూమి తమదంటూ స్థానికంగా నాయకులుగా చెలామణి అవుతున్న ఒక నాయకుడితో పాటు అనీష్ కన్స్ట్రక్షన్స్ అనే సంస్థ క్లెయిమ్ చేస్తూ బోర్డులు పెట్టిందని తెలిపారు. కబ్జాదారులు నిర్మాణాలు చేపట్టడానికి ప్రయత్నించడంతో స్థానికులు హైడ్రాకు ఫోటోలు పంపించారని చెప్పారు. రాళ్ల రప్పలతో వ్యవసాయ వినియోగానికి అవకాశం లేని ఈ ప్రభుత్వ భూమిలో వ్యవసాయం చేస్తున్నామంటూ అసఫ్ జాహీ పైగా కుటుంబ వారసుల నుంచి కొన్నామంటూ కబ్జాదారులు చెబుతున్నారని తెలిపారు. కాగా, శంషాబాద్ పరిధిలో పైగా కుటుంబాలకు చెందిన భూములు లేవని రెవెన్యూ అధికారులు ధ్రువీకరించారని తెలిపారు. వేరే చోట ఉన్న ఆ భూముల రికార్డులను ఇక్కడ చూపించి కబ్జాలకు పాల్పడినట్టు తెలిపారు. అనీష్ కన్స్ట్రక్షన్స్ సంస్థకు చెందిన శ్రీపాద దేశ్‌పాండే పలు భూముల వివాదాల్లో ఉన్నట్టు హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. ఈ అంశాలన్నింటినీ పరిశీలించి అక్రమ నిర్మాణాలను హైడ్రా తొలగించిందని తెలిపారు. భూ వివాదంపై అనీష్ కన్స్ట్రక్షన్ సంస్థ యజమాని శ్రీపాద దేశ్‌పాండే మాట్లాడుతూ.. కోర్టులో కేసు ఉండగానే హైడ్రా అధికారులు కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా కూల్చివేయడం అన్యాయమని అన్నారు.

నగరంలో కల్కి కచువా ఏర్పాటు



హైదరాబాద్ : కల్కి తన స్వతంత్ర ఫ్యాషన్ షోకేస్‌ను నగరంలో ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బాలీవుడ్ స్టార్ వరుణ్ ధావన్, తారా సుతారియా సందడి చేశారు. భారతీయ కచువా కొనుగోలుదారు అభిరుచుల మేరకు ఫ్యాషన్ దుస్తుల తయారీ చేస్తుందని కల్కి సిఇఒ సౌరభ్ గుప్తా తెలిపారు. తన గ్లోబల్ క్లయింట్ల కోసం రూ.1.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు విలువ చేసే కలెక్షన్లను అందిస్తున్నామన్నారు.

రిలాక్సో ఫుట్ వేర్ నుంచి 50 కొత్త ఉత్పత్తులు

హైదరాబాద్ : అతిపెద్ద పాదరక్షల కంపెనీల్లో ఒక్కటైనా రిలాక్సో ఫుట్‌వేర్ రాబోతున్న పండుగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని కొత్తగా 50పైగా ఉత్పత్తులను విడుదల చేసింది. హైదరాబాద్‌లో రిలాక్సో 'రిటైలర్ మీట్'ను నిర్వహించగా.. దీనికి 245 కంటే ఎక్కువ మంది భాగస్వాములు హాజరయ్యారని రిలాక్సో ఫుట్‌వేర్స్ హోల్ టైమ్ డైరెక్టర్ గౌరవ్ కుమార్ దువా పేర్కొన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలందించడానికి సరైన సాధనాలు, నైపుణ్య ఆవిష్కరణలతో వారికి సాధికారత కల్పించాలనే తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తుందన్నారు.

గ్రూప్-1 అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు
- సిద్దిపేటలో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'పలానా మంత్రులు, అధికారులు లక్షల రూపాయలు లంచం అడిగారని ఓ వైపు నిరుద్యోగులు చెబుతుంటే, మరోవైపు గ్రూప్-1 పరీక్ష ఇంత నిర్లక్ష్యంగా నిర్వహిస్తారా అని స్వయంగా హైకోర్టు.. ప్రభుత్వంపై మొట్టికాయలు వేసింది.. నిజంగా తప్పు చేయకపోతే ముఖ్యమంత్రి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పంచిలో మెగా జాబ్‌మేళాను ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతికి పాల్పడ్డ వారిని శిక్షించాలని కోరారు. తప్పు సరిదిద్దకుండా మరో అప్పీల్‌కి పోదామని చెప్పడం మూర్ఖత్వమని అన్నారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని, రెండేండ్లు పూర్తవుతున్నా ఉద్యోగాలు ఏమయ్యాయని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. అసెంబ్లీలో గట్టిగా నిలదీస్తే చర్చ పెట్టకుండా జాబ్ క్యాలెండర్ అని పారిపోయారని తెలిపారు. హుస్నాబాద్ సభలో ప్రియాంక గాంధీతో చెప్పించిన నిరుద్యోగ యువతకు 4000 నిరుద్యోగ భృతి సంగతి ఏమయిందని ప్రశ్నించారు.

ప్రభుత్వం నిరుద్యోగ యువతని పూర్తిగా మోసం చేసిందని, మీ పక్షాన తాము అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని తెలిపారు. చాలా మందికి ప్రభుత్వ ఉద్యోగం వస్తేనే బాగుండు అనుకుంటారని, అలా అనుకోవడంలో తప్పులేదు కానీ జీవితంలో మొదటి అడుగు పడటం అనేది చాలా ముఖ్యమన్నారు. దాదాపు 30 కంపెనీలు మీకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఇక్కడికి వచ్చాయని తెలిపారు. ఉన్నత ఉద్యోగానికి, ప్రభుత్వ ఉద్యోగానికి ప్రయత్నం చేస్తూ ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

కన్నెగంటి రంగయ్యకు కన్నీటి వీడ్కోలు

- అంతిమ యాత్రలో పాడె మోసిన జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పీడిత ప్రజల కోసం ఆనాడు చేసిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరుల త్యాగాలు వృథా కానివ్వమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు కన్నెకంటి రంగయ్య అంతిమ యాత్ర శనివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం యాద్గారిపల్లి గ్రామంలో నిర్వహించారు. ముందుగా రంగయ్య భౌతికకాయంపై జూలకంటి ఎర్ర జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. భూస్వాములు, రాజాకార్లు, నిజాం నవాబులకు వ్యతిరేకంగా పేదల పక్షాన పోరాటాలు సాగించాలని గుర్తు చేశారు. చిన్నప్పటి నుంచి ఎర్రజెండా చేతపట్టి ఉద్యమాల్లో దళ కమాండర్‌గా పనిచేశారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక చోట్ల జరిగిన పోరాటాల్లో కన్నెకంటి రంగయ్య ప్రత్యక్షంగా పాల్గొని పేదల సమస్యలు పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. అజ్ఞాతం, జైలు జీవితాలను గడిపి, ఎన్నో నిర్బంధాలు ఎదుర్కొని ప్రజల పక్షాన పోరాటాలు చేశారన్నారు. ఎర్రజెండా ద్వారానే సమ సమాజ స్థాపన జరుగుతుందని, ప్రపంచానికి ఎర్రజెండే ప్రత్యామ్నాయమని అన్నారు. రంగయ్య చూపిన మార్గంలో భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. రంగయ్య ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్తా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాగా, అంత్యక్రియల్లో రంగయ్య పాడెను జూలకంటి రంగారెడ్డితో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మోశారు. ఆ పార్టీ మాజీ కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు సంతాపం ప్రకటించారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, నల్లమోతు భాస్కరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లక్ష్మీనారాయణ, వీరేపల్లి వెంకటేశ్వర్లు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరై నివాళులర్పించారు.

పోలీస్ అధికారికి ఫిర్యాదు అందజేస్తున్న చనగాని

కెటిఆర్ వ్యాఖ్యలపై ఒయు పిఎస్‌లో ఫిర్యాదు

- గ్రూప్-1 పోస్టులపై వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి
- టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-1 పోస్టులను రూ. మూడు కోట్లకు అమ్ముకున్నారని కెటిఆర్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ అన్నారు. కెటిఆర్ వ్యాఖ్యలపై శనివారం ఆయన హైదరాబాద్ ఒయు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగేంచే కెటిఆర్ వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. అలాగే, 24 గంటల్లో ప్రభుత్వానికి క్షమాపణ చెప్పాలని లేకపోతే.. రూ. 100 కోట్ల పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. పదేళ్ల పాలించిన బిఆర్ఎస్ గ్రూప్-1 పరీక్షలు నిర్వహించలేకపోయిందని, ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగుల్లో ప్రభుత్వం పట్ల విద్వేషాలు కలిగేలా కెటిఆర్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. కోర్టు తీర్పును కెటిఆర్ వక్రీకరిస్తూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని,కెటీఆర్ చేసిన విష ప్రచారాన్ని నిరుద్యోగులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు మెడ శ్రీనివాస్, నాయకులు మోహన్ బొట్టభత్తుల, నిరుద్యోగులు పరశురామ్, ఈశ్వర్, భార్గవ్, రవి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ ఇంజనీరింగ్ సదస్సు

హైదరాబాద్ : అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ మెకానికల్ ఇంజనీరింగ్ కాంగ్రెస్ అండ్ ఎక్స్‌పోజిషన్ ఘనంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు. దేశంలోనే తొలిసారి తొలిసారి దీన్ని ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. హెచ్ఐసిసిలో సెప్టెంబర్ 10 నుంచి 13 వరకు మూడు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా 500 మందికి పైగా స్పీకర్లు, 1,500 మంది ప్రతినిధులు, 75 మంది ప్రదర్శనకారులు పాల్గొన్నారని ఆ సంస్థ అధికారులు వెల్లడించారు. ఇంజనీరింగ్ విభాగాలలో ఆవిష్కరణలు, సుస్థిర పరిష్కారాలు, అంతర్జాతీయ సహకారం వంటి అంశాలపై ఈ సదస్సులో లోతైన చర్చలు జరిగాయన్నారు.

నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ 26,000 ఇవ్వాలి

- పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ 26,000 ఇవ్వాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ పంజాగుట్ట నిమ్స్ హాస్పిటల్‌లో ప్రధాన ద్వారం వద్ద నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రిటైర్మెంట్ అయిన ముగ్గురు కార్మికులకు, మరణించిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు యూనియన్ నుంచి ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు ఉన్న హక్కులను తొలగించి అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా కార్మికవర్గం జులై 9న సమ్మె చేసిందన్నారు. హక్కులు సాధించడానికి కార్మికులందరూ ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపు ఇచ్చారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం శ్రీనివాసరావు, అధ్యక్షులు ఎం. వెంకటేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 8 గంటల పనిని 10 గంటలు చేస్తూ జీవో ఇవ్వడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. కనీస వేతనాల చట్టం ప్రకారం కార్మికులకు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి పెరుగుతున్న ధరలను అనుగుణంగా కనీస వేతనాలను సవరించాలని ఉన్నా 15 ఏళ్లుగా కార్మికులకు సంబంధించిన 73 షెడ్యూల్డ్ పరిశ్రమల కనీస వేతనాల జీవోలను గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు సవరించకపోవడం అన్యాయమని అన్నారు. నిమ్స్ యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులకు గతంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ అయిన కార్మికులకు నిమ్స్ హాస్పటల్లో ఉచితంగా వైద్యం అందించాలన్నారు. నూతనంగా పిలిచిన టెండర్లలో కార్మిక వ్యతిరేక క్లాజులను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్, యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.ప్రవీణ్ కుమార్ కార్మికులు పాల్గొన్నారు

మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సిపి

ఇంట్లో పని చేసే వ్యక్తే హంతకుడు

- కూకట్‌పల్లి మహిళ హత్య కేసులో నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన సైబరాబాద్ సిపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నగరంలోని కూకట్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన మహిళ హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మహిళ ఇంట్లో పనిచేసే వ్యక్తే హంతకుడిగా గుర్తించారు. ఆమెను హత్య చేసి బంగారంతోపాటు నగదును దొంగిలించినట్టు నిర్ధారించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీపీ అవినాష్ మహంతి శనివారం వెల్లడించారు. కూకట్‌పల్లి పీఎస్ పరిధిలో స్వాన్ లేక్ అపార్ట్‌మెంట్‌లో రేణు అగర్వాల్ అనే మహిళ ఉంటోంది. కొద్ది రోజుల క్రితమే ఆమె ఇంట్లో హర్ష అనే వ్యక్తి పనికి కుదిరాడు. రోషన్ అనే మరో వ్యక్తి అదే అపార్ట్‌మెంట్‌లో పై అంతస్తులో పని చేసేవాడు. రేణు అగర్వాల్ ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ఆమెను హత్య చేసేందుకు నిందితులు పథకం రచించారు. ఈ నెల 10వ తేదీన రేణు అగర్వాల్‌పై తన ఇంట్లోనే కుక్కర్‌తో దాడి చేశారు. ఈ ఘటనలో ఆమె తలకు బలమైన గాయం కావడంతో ఆమె కింద పడిపోయింది. వెంటనే ఆమె కాళ్లు, చేతులు కట్టేసి బంగారం, ఇతర నగదును దోచుకుని నిందితులు వెళ్లిపోయారు. ఏడు తులాల బంగారం, ఖరీదైన వాచ్‌లు, ఇతర సామగ్రిని దొంగిలించారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రేణు అగర్వాల్ అప్పటికే మృతిచెందింది. కేసు నమోదు చేసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. నిందితులు హర్ష, రోషన్‌ను శనివారం అరెస్టు చేశారు. నిందితులపై గతంలో కూడా మూడు కేసులు ఉన్నాయి. ఈ కేసులో రోషన్ సోదరుడిని సైతం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సిఐ తెలిపారు. ఈ సమావేశంలో పోలీసు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.